
సంచలన సాయంకాల పత్రిక
సత్యం
https://www.satyamdaily.net/
శనివారం 16-8-2025
సంపుటి: 21 సంచిక: 124
పేజీలు: 8 వెల: రూ.1



# ఊరంతా వణికిపోతోంది!

- శుక్రవారం అర్థరాత్రి మూడు ద్విచక్ర వాహనాలు దహనం చేసిన దుండగుడు
- టీకే రాజపురంలో తాజాగా మరో దొంగతనం
- వంగరలో పోలీసులు అరెస్ట్ చేసిన నిందితుడిపైనే అనుమానం

- వార్త చివరిపేజీలో







• ఎడిటోరియల్

# ప్రసవాల్లో ఈ తేడాలెందుకో?

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ప్రభుత్వాలు చెబుతున్నాయి. అయినా సిజేరియన్లు ఈమధ్య కాలంలో విపరీతంగా పెరిగిపోయాయన్నది వాస్తవం. ప్రభుత్వ ఆస్పత్రుల సంగతెలా ఉన్నా.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవం అంటే అది కచ్చితంగా సిజేరియనే! అన్న అభిప్రాయం బలంగా నాటుకుపోయింది. కానీ విడ్డూరం ఏమింటే.. ఇందులో కూడా మతపరమైన తేడాలు ఉన్నాయట. హిందూ మహిళలకే ఎక్కువగా సి-సెక్షన్ అంటే కడుపు కోత ద్వారా 90 శాతానికిపైగా ప్రసవాలు జరుగుతుంటే.. ముస్లిం మహిళల్లో దానికి పూర్తి విరుద్ధంగా ఏకంగా 94శాతం మేరకు సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయని తాజా అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఏ ప్రభుత్వ నివేదిక కూడా ఈ గణాంకాలను అధికారికంగా ప్రకటించకపోయినా వాస్తవ పరిస్థితులను, ఆస్పత్రుల పనితీరును పరిశీలిస్తే ఈ తేడా స్పష్టంగా తెలుస్తుంది. హిందూ సమాజంలో మహిళ గర్భం దాల్చినప్పటి నుంచే క్రమం తప్పకుండా చెకప్‌లు, సోనోగ్రఫీలు టెస్టులు, మందులు వాడుతుంటారు. డెలవరీ వరకు ఇవి కొనసాగినా చివరికి ఆపరేషన్ చేయకతప్పడంలేదు. మరోవైపు ముస్లిం మహిళలు ఇప్పటికీ పాత పద్ధతులపైనే ఆధారపడతారు. ప్రభుత్వ ఆస్పత్రులు లేదా చిన్న నర్సింగ్‌హోమ్‌లను ఆశ్రయించి సాధారణ ప్రసవం ద్వారా బిడ్డలను కంటుంటారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ పరిస్థితికి కారణం ప్రైవేట్ ఆస్పత్రులే. ఈ ఆస్పత్రులు సాధారణ ప్రసవాల కంటే ఎక్కువ ఆదాయం ఇచ్చే సిజేరియన్లనే ప్రోత్సహిస్తుంటాయి. సాధారణ ప్రసవానికి రూ.10వేల నుంచి రూ.20వేలు ఖర్చు అవుతుండగా.. సిజేరియన్ చేస్తే దీనికి ఐదారు రెట్లు ఎక్కువ ఖర్చవుతుంది. అలాగే సాధారణ ప్రసవ ప్రక్రియ సమయంతో కూడుకున్నది, సిబ్బంది చాలా గంటలు అప్రమత్తంగా పనిచేయాల్సి ఉంటుంది. అదే ఆపరేషన్ అయితే ఒక గంటలోనే పూర్తవుతుంది. అందువల్ల ప్రైవేట్ ఆస్పత్రులకు సిజేరియన్ ఒక సురక్షితమైన, లాభదాయకమైన వనరుగా మారింది. మరో వాదన కూడా ఉంది. హిందూ సమాజానికి చెందిన చాలామంది మహిళలు ఇప్పుడు కూర్చుని పనిచేసే ఉద్యోగాలు చేస్తున్నారు. మొబైల్, టీవీ వాడకం ఎక్కువ. దానివల్ల యోగా, వ్యాయామానికి దూరమవుతున్నారు. బయట ఆహారం ఎక్కువగా తింటున్నారు. ఇవన్నీ సాధారణ ప్రసవానికి ప్రతిబంధకాలే. మానసిక ఒత్తిడి, అనవసరమైన మందులు కూడా గర్భధారణను బలహీనపర్చి ఆపరేషన్ వైపు మళ్లిస్తాయన్న వాదన కూడా ఉంది. ముస్లిం మహిళల విషయానికొస్తే.. వారి జీవితం శారీరక శ్రమతో కూడుకున్నది. ఇంటి పనుల్లో చురుకుగా ఉంటారు. ఆహారంలో సత్తుపిండి, ఖర్జూరం, హలీమ్, పాలు, డ్రై ఫ్రూట్స్ వంటి సంప్రదాయ, పోషక పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని బలంగా ఉంచి సహజ ప్రసవానికి సహకరిస్తాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాల ప్రకారం ఏ దేశంలోనూ సి-సెక్షన్ల రేటు పది శాతానికి మించకూడదు. కానీ మన దేశంలో సగటు సిజేరియన్ల రేటు 21.5 శాతం. ఇందులో ప్రైవేట్ ఆస్పత్రుల వాటాయే 80 శాతం వరకు ఉంటుంది. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే గణాంకాల ప్రకారం గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో సి-సెక్షన్ల రేటు రెట్టింపుగా ఉంది. సి-సెక్షన్ డెలివరీ తర్వాత మహిళల్లో నీరసం, వెన్ను నొప్పి, ఊబకాయం, మానసిక ఒత్తిడి, మళ్లీ గర్భం ధరించడంలో సమస్యలు వంటి దుష్ప్రభావాలు కనిపిస్తాయి. పిల్లల్లో రోగనిరోధక శక్తి కూడా తక్కువగా ఉంటుంది. అదే సాధారణ ప్రసవం చేసుకున్న మహిళలు త్వరగా కోలుకుంటారు. సులభంగా పాలివ్వగలరు, వారి పిల్లల్లో రోగనిరోధక శక్తి కూడా మెరుగుపడుతుంది. అయినా సిజేరియన్లు పెరుగుతుండటంపై ప్రభుత్వాలు సీరియస్‌గా స్పందించాలి. గర్భిణీ స్త్రీలకు క్రమం తప్పకుండా యోగా, తేలికపాటి వ్యాయామాలు, సరైన ఆహార అలవాట్ల గురించి సమాచారం ఇచ్చి చైతన్యపర్చాలి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో పెరుగుతున్న సి-సెక్షన్ల రేటుపై దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. సాధారణ ప్రసవాలు జరగకపోవడానికి గల కారణాలను వివరించే బాధ్యతను వైద్యులకు అప్పగించాలి. విజయవంతంగా సాధారణ ప్రసవాలు చేసుకున్న మహిళల ఉదంతాలను ప్రచారం చేయాలి. సాధారణ ప్రసవం కేవలం ఒక వైద్య ప్రక్రియ కాదు.. అది ఒక సహజమైన హక్కు అన్న అవగాహనను మహిళల్లో కల్పించాలి. మహిళలను వారి హక్కుల నుంచి దూరం చేయకుండా ఉండటానికి సమాజం, వైద్య వ్యవస్థ, కుటుంబాలు కలిసి నిర్ణయం తీసుకోవాలి. ఇది కేవలం హిందూ ముస్లింల మధ్య తేడాకు సంబంధించిన సమస్య కాదని గుర్తించాలి.

## మత్స్యకార యువతకి ఘన సత్కారం

(సత్యంన్యూస్, సోంపేట)

బారువా మెరైన్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ జాబితాలో బారువా మేరైన్ పోలీస్ స్టేషన్ ఇలాకా తీరప్రాంత మత్స్యకార కానిస్టేబుల్‌గా ఎంపికైన యువతకు బారువ సీఐ వి.రమేష్ దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించారు. తీర ప్రాంతంలో మత్స్యకార యువత ఎంతగానో శ్రమించి పోలీస్‌శాఖలో ఎంపికైనందుకు అభినందిస్తూ ఈ విజయం తీర ప్రాంత యువతకు స్ఫూర్తిదాయకం కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎన్.శ్రీనివాస్, ఎఎస్సైలు మాధవరావు కోదండరావు, డొంక ఝాన్సీ, కర్రి దిలీప్ కుమార్, వంక ప్రకాష్, నిట్ట బైరాగి, నిట్ట నవీన్, వాడ మహేష్, చీకట లక్ష్మణ్‌మూర్తి, చెక్క లింగరాజులు పాల్గొన్నారు.



## మహా ధర్నాకు తరలిరండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం ఎన్జీవో హోంలో డిఎస్సీ 2003 ఫోరం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి అధ్యక్షతన మహా ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా డిఎస్సీ 2003 ఉపాధ్యాయులకు మరియు 1 సెప్టెంబర్ 2004కు ముందే నియామక ప్రక్రియ పూర్తయి పోస్టింగులు మాత్రం ప్రభుత్వ విధానాల వల్ల ఆలస్యమైనా మరికొందరి ఉద్యోగులకు పాత పెన్షన్ వర్తింపు చేయమని డిమాండ్ చేస్తూ, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం గత ఐదు సంవత్సరాలుగా నాన్చుడి ధోరణి ప్రదర్శించడం వలన తప్పని పరిస్థితులలో ఈనెల 25న విజయవాడ ధర్నాచౌక్ కేంద్రంగా మహాధర్నాను నిర్వహించి తలపెట్టామన్నారు. ఈ ధర్నాకు బాధిత డిఎస్సీ-2003 ఉపాధ్యాయులు, బాధిత ఉద్యోగులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దాదాపు 16రాష్ట్రాలు అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం మెమోను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో అర్థం కావడం లేదని, అనేక వినతులు విజ్ఞప్తులు ద్వారా ప్రభుత్వ పెద్దలకు నివేదించిన తర్వాత ఉద్యమ కార్యాచరణలో భాగంగా రాష్ట్రస్థాయి మహాధర్నాను ఈనెల 25వ తేదీ సోమవారం నాడు విజయవాడ కేంద్రంగా నిర్వహిస్తున్నామని, ఈ మహాధర్నాలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దుప్పల శివరాం ప్రసాద్, ఎస్వీ రమణ, దానేటి కేశవరావు, కూన రంగనాయకులు, పూజారి హరిప్రసన్న, సూర పాపారావు, కరిమిరాజేశ్వరరావు, గురుగుబెల్లి భాస్కరరావు, ఎ.తిరుమలేశ్వర్రావు, లక్ష్మణ్, జి.గోవిందరావు, నారాయణరావు, పాల్గుణరావులతోపాటు వివిధ మండలాల డీఎస్సీ 2003 కన్వీనర్లు హాజరయ్యారు.

## ఆధునిక ఈ-టెప్ పద్ధతిలో హెర్నియా శస్త్రచికిత్స విజయవంతం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మెడికోవర్ ఆసుపత్రిలో మొదటిసారిగా ఆధునిక ఈ-టెప్ లాపరోస్కోపిక్ పద్ధతిలో ఇంగ్వైనల్ హెర్నియా శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సను డాక్టర్ మనోజ్ కుమార్ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ వంశీ నిపుణుల బృందంతో కలిసి చేశారు. డా. మనోజ్ కుమార్ మాట్లాడుతూ ఈ పద్ధతిలో చిన్న కోతతో, రోగికి తక్కువ నొప్పి, తక్కువ రక్తస్రావం, త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. రోగి మరుసటి రోజు నుంచే సాధారణ పనులు చేయగలడు. శ్రీకాకుళం ప్రజలకు ఈ ఆధునిక సర్జరీ పద్ధతి ఇప్పుడు స్థానికంగానే అందుబాటులో ఉందని తెలిపారు. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ వంశీ మాట్లాడుతూ "ఈ-టెప్ టెక్నిక్ పెద్దనగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండేదన్నారు. ఇప్పుడు శ్రీకాకుళం ప్రజలకు కూడా ఈ



సాంకేతికత అందుబాటులోకి రావడం వల్ల, రోగులు దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే అత్యాధునిక చికిత్స పొందగలుగుతున్నారన్నారు. మెడికోవర్ ఆసుపత్రి ప్రతినిధులు మాట్లాడుతూ ఇకపై ఇలాంటి ఆధునిక శస్త్రచికిత్సలు, నూతన వైద్య సాంకేతికతలు శ్రీకాకుళంలోనే అందుబాటులో ఉండేలా కృషి చేస్తామని తెలిపారు.

## కిడ్నీ వ్యాధిగ్రస్థుల బాధలు పట్టవా?

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉద్దానం కిడ్నీ వ్యాధులకు కారణాలు పరిశీలించడానికి అంతర్జాతీయ నిపుణులతో కూడిన బృందాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న 40 డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు కొనారి మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్దానంలో కిడ్నీ వ్యాధులతో ప్రజలు చనిపోతుంటే రాష్ట్ర ప్రభుత్వానికి పట్టదా అని వారు ప్రశ్నించారు. ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం జీవో నెంబర్ 102 ద్వారా పలాసలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి రీసెర్చ్ సెంటర్, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. కిడ్నీ ఆసుపత్రిలో 60 డాక్టర్ పోస్టులకు గాను 40డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దీనివలన కిడ్నీ వ్యాధిగ్రస్తులకి వైద్యం అందక మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు 108 ద్వారా ఉచితంగా డయాలసిస్ కేంద్రానికి తీసుకువచ్చే వారిని ఇప్పుడు ఆ సౌకర్యాన్ని ప్రభుత్వం ఎత్తేయడంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెఫ్రో ప్లస్ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న డయాలసిస్ కేంద్రం పూర్తిస్థాయిలో అందుబాటులో లేక నెఫ్రాలజీ డాక్టర్ లేక సరిపడే బెడ్స్ లేక కిడ్నీ వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు పట్టదా అనివారు ప్రశ్నించారు. కేంద్రం నుండి నిధులు తెచ్చి కిడ్నీ రీఛార్జ్ కేంద్రాన్ని ఎందుకు పరిశోధన కార్యక్రమాలు చెయ్యడం లేదని వారు కేంద్రమంత్రిని ప్రశ్నించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు గతంలో ఉన్న సౌకర్యాలు ఎత్తేయడంతో డయాలసిస్‌కి వచ్చేవారు రూ.1600లు కిట్లు కొనుక్కొని వచ్చి డయాలసిస్ చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్దానం గ్రామాలకు గత సుజలదార శుద్ధ జలాల నీరుని పైపులైన్ ద్వారా ఎప్పటికీ అనేక గ్రామాలకు అందకపోవడంతో మంచినీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంచినీరే అందించలేని ఈ ప్రభుత్వం అభివృద్ధి చేస్తామని ప్రగలభాలు పలుకుతుందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సంగారు లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు



# మొన్న చరణ్.. ప్రభాస్.. ఇవాళ ఎన్టీఆర్!



ఇప్పుడంటే తెలుగు సినిమా స్థాయి విపరీతంగా పెరిగి మిగిలిన భాషలకు చెందిన వాళ్లంతా టాలీవుడ్ వైపు చూస్తున్నారు కానీ ఒకప్పుడు తెలుగు సినిమాను మిగిలిన వారంతా ఎంతో చులకనగా చూసేవాళ్లనే సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అందుకే తమ క్రేజ్ ను పెంచుకోవడానికి, తమ మార్కెట్ ను మరింత బలోపేతం చేసుకోవడానికి టాలీవుడ్ కు చెందిన హీరోలంతా వేరే భాషలకు చెందిన డైరెక్టర్లతో మరీ ముఖ్యంగా బాలీవుడ్ డైరెక్టర్లతో జట్టు కట్టడానికి ఆసక్తి చూపించేవారు.

### జంజీర్ తో చరణ్ బాలీవుడ్ డెబ్యూ

అలా ఎంతోమంది హీరోలు పర భాషా డైరెక్టర్లతో కలిసి పని చేశారు. అయితే అలా చేసిన వాళ్లకు ఎక్కువ శాతం ఫెయిల్యూర్లే ఎదురయ్యాయి. బాలీవుడ్ డైరెక్టర్లతో టాలీవుడ్ హీరోలు చేసిన సినిమాలైతే మరీ దారుణమైన టాక్ ను తీసుకురావడంతో పాటూ వారికి చాలా చేదు అనుభవాన్ని మిగిల్చాయి. గతంలో రామ్ చరణ్ బాలీవుడ్ ఎంట్రీ ఇస్తూ అక్కడి డైరెక్టర్ తో జంజీర్ తీయగా అది డిజాస్టర్ అయిన విషయం తెలిసిందే.

### ఆదిపురుష్ తో ప్రభాస్ కు చుక్కెదురు

ఆ తర్వాత పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, ఓం రౌత్ దర్శకత్వంలో ఆదిపురుష్ చేస్తే అది కూడా ఆశించిన ఫలితాన్నివ్వలేకపోయింది. ఇక ఇప్పుడు తాజాగా వార్2 సినిమాతో ఎన్టీఆర్ కు కూడా అదే పరిస్థితి ఎదురైంది. అయాన్ ముఖర్జీని మరీ ఎక్కువగా నమ్మేసి తారక్ వార్2తో ఎవరూ ఊహించని షాక్ ను ఎదుర్కొన్నారు. అయితే ఈ విషయంలో టాలీవుడ్ లో ఓ ఇద్దరు హీరోల ముందుచూపుని మాత్రం మెచ్చుకోవాల్సిందే.

### వారి రూటే సపరేటు


వాళ్లే సూపర్ స్టార్ మహేష్ బాబు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్. వారిద్దరూ ఇండస్ట్రీలోకి వచ్చి ఇన్నేళ్లవుతున్నా ఎప్పుడూ బాలీవుడ్ డైరెక్టర్ల జోలికి పోలేదు. కనీసం మహేష్ బాబు వేరే భాషకు చెందిన డైరెక్టర్ తో అయినా సినిమాలు చేశారేమో కానీ బన్నీ మాత్రం అది కూడా చేయలేదు. మధ్యలో బాలీవుడ్ డైరెక్టర్లు చెప్పిన కథలు విన్నప్పటికీ, వారిని గుడ్డిగా నమ్మేసి ముందడుగు మాత్రం వేయలేదు. బన్నీ మొదటిసారి వేరే భాషకు చెందిన డైరెక్టర్ అయిన అట్లీతో ఇప్పుడే సినిమా చేస్తున్నారు. ఇప్పటివరకు వేరే ఇండస్ట్రీకి చెందిన డైరెక్టర్ తో వర్క్ చేయలేదు. ఓ వైపు ప్రభాస్, రామ్ చరణ్, ఎన్టీఆర్ బాలీవుడ్ కు వెళ్లి ఎదురుదెబ్బలు తింటే మహేష్, బన్నీ మాత్రం సౌత్ ఈజ్ బెస్ట్ అనే ఫార్ములాని ఫాలో అవుతూ తమ కెరీర్లో ముందుకు ఎదుగుతున్నారు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

## 'జాతర' జాతకం.. బయ్యర్ల చేతుల్లో

ఈనెల 27న రావాల్సిన 'మాస్ జాతర' వాయిదా పడింది. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ బాకీ ఉందని, పోస్ట్ ప్రొడక్షన్ కూడా జరగాల్సివుందని చిత్ర బృందం చెబుతున్నా వాస్తవ పరిస్థితులు పూర్తిగా వేరు. సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించిన చిత్రమిది. నాగవంశీ నిర్మాత. ఆయన బ్యానర్ నుంచి ఇటీవల వచ్చిన 'కింగ్ డమ్' బయ్యర్లకు నష్టాల్ని మిగిల్చింది. ఇప్పుడు 'వార్ 2' కూడా ఆయనే విడుదల చేశారు. ఈ సినిమాని నాగవంశీ పై నమ్మకంతో బయ్యర్లు మంచి రేటుకి కొన్నారు. ఇది కూడా ఫెయిల్యూర్ ప్రాజెక్టే. ఈ సినిమాతో ఎంత పోతుందో తేలాల్సివుంది. ఈ నష్టాల్ని 'మాస్ జాతర'తో భర్తీ చేయాలంటూ బయ్యర్లు నాగవంశీపై ఒత్తిడి పెంచుతున్నట్టు తెలుస్తోంది. అందుకే 'మాస్ జాతర'ని వాయిదా వేశారని సమాచారం. దానికి తోడు మాస్ జాతరకు ఎలాంటి బజ్ లేదు. టీజర్ విడుదల చేసినా పెద్దగా ఇంపాక్ట్ రాలేదు. పైగా ఓ పాట.. అందులోని బూతులు బాగా ట్రోల్ అయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో మాస్ జాతరని విడుదల చేసినా పెద్దగా ఫలితం ఉండదన్నది నాగవంశీ నమ్మకం. ఈ ఫ్లాపుల నుంచి తేరుకోవడానికి కూడా ఆయనకు కొంత టైమ్ కావాలి. అందుకే మాస్ జాతరని వాయిదా వేయాలని నిర్ణయించుకొన్నారు. మాస్ జాతర వస్తోందని ఈనెల 27న వేరే సినిమాలు ఆగిపోయాయి. వాటిలో ఒకటో రెండో.. మాస్ జాతర డేట్ ని భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయి.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...





## ఓ మహాత్మా, ఓ మహర్షీ..

# ఏమిటీ స్వతంత్ర స్వరూపం..?



కొన్ని నినాదాలు, కొన్ని పాటలు, కొన్ని భావనలు కాలం గడుస్తున్న కొద్దీ పాతబడిపోయి, వాటి ప్రాముఖ్యాన్ని కోల్పోతాయి. ఒకప్పుడు అవి ఇచ్చిన ఉత్తేజాన్నీ, ఆవేశాన్నీ, ఉద్వేగాన్నీ ఇప్పుడు ఇవ్వవు. తప్పు ఆ పాటలదో, ఆ భావనలదో, ఆ నినాదాలదో కాదు. అలాగనీ స్పందించకుండా మొరటుగా శిలాసదృశంగా మిగిలిపోయిన మనదీ కాదు.

'మాదీ స్వతంత్ర దేశం.. మాదీ స్వతంత్ర జాతి' అని ఏ టంగుటూరి సూర్యకుమారో గొంతెత్తి పాడుతూ ఉంటే వినడం బావుండేది. ఆ స్వరంతో కోరస్ కలపడం మరింత బావుండేది. పాట వింటున్నప్పుడూ, కోరస్ పాడుతున్నప్పుడూ శరీరం అంత ఒక ఉద్వేగపు చలిచినుకై వణికిపోయేది. వందేమాతరం అన్న ఒక్క నినాదం లోలోపల విస్మృతంగా, అనామకంగా పడివున్న పోరాట కాంక్షను ప్రజ్వరిల్లజేసేది. కానీ ఇప్పుడు ఆ పాటలు, ఆ మాటలు, ఆ భావనలు ఇవ్వాల్సినంత ఉద్వేగాన్నీ, ఇవ్వాల్సినంత ఆనందాన్నీ ఇవ్వలేవు. స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజులలో వున్న భావనలు వేరు. ఇప్పటి ఆలోచనలు, ఆకాంక్షలు వేరు. వాటి మధ్య హస్తిమశకాంతరం ఉంది.

1947 భారతదేశ చరిత్రలో ఒక గొప్ప సంవత్సరం. 1947 ఆగస్టు 15 పరాయి దాస్య శృంఖలాల నుంచి దేశం విముక్తి చెందిన రోజు. సమస్థ ప్రపంచమూ సుఖ సుషుప్తిలో మునిగివున్న వేళ ఒక్క భారతదేశం మాత్రమే మేలుకుని తన నూతన ప్రస్థానానికి తొలి తొలి అడుగులు వేసిన సమయం. మువ్వన్నెల జెండా వినువీధిలో విలాసంగా ఎగిరిన సమయం. దేశమంతా ఒక ఉత్సాహం. ఒక ఉద్వేగం. ఒక వినూత్న ఆనందం. ఆగస్టు 15 ఎలా గడిచిపోయిందో ఎవరికీ తెలియదు. కాలం ఎవరికోసమైనా ఆగుతుందా? రెండేళ్లు గడిచాయి. భారతదేశం పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్య స్వరూపం సామాన్య జనానికి కాకపోయినా బుద్ధిజీవులకు స్పష్టంగానే అర్థమైంది. అది కేవలం రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే. సాంఘిక, ఆర్థిక, భౌతిక, ఆధ్యాత్మిక స్వాతంత్ర్యం ఇంకా సాధించవలసే ఉంది. సాధించుకున్న రాజకీయ స్వాతంత్ర్య స్వరూపం మాత్రం ఎలా ఉంది?

ఎలా ఉన్నదో ఒక తెలుగు రచయిత ఒక పేజీన్నర నిడివి ఉన్న చిన్న కథలో చెపుతున్నాడు. చిన్న కథే కనుక ఇక్కడ నేను మొత్తం కథ ఉటంకిస్తున్నాను.. చదవండి.

### స్వాతంత్ర్య స్వరూపం!

ఒకప్పుడు ఒక పిల్ల దేశం, ఇంకో దేశం నించి నానా అవస్థలు పడి స్వాతంత్ర్యం సంపాదించింది. ఆ పిల్ల దేశంలో ప్రజలు స్వాతంత్ర్యం వచ్చినందుకు గుర్తుగా ఓ స్వతంత్ర విగ్రహం చేయించి రాజధాని నగరంలో ప్రతిష్ఠించుదామని తమ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. ప్రభుత్వం కూడా ప్రజల ఆలోచన బాగానే ఉందని ఒప్పుకుని ఒక శిల్పిని పిలిపించింది. ఆ శిల్పి అఖండమైన కళోపాసకుడు. అదివరకు చాలా విగ్రహాలు చేశాడు. అతను చేసిన విగ్రహాలు జీవకళ ఉట్టిపడుతూ ఉండేవి. ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం ఆ శిల్పి ఒక సుముహూర్తంలో మంచి చలువరాయితో విగ్రహం చేసేందుకు ఉపక్రమించాడు.

స్వతంత్రాన్ని ప్రజలు పోరాడి తెచ్చుకున్నారు కనుక, స్వతంత్ర విగ్రహం, తమ పోరాటాల చరిత్రను ఎప్పుడూ జ్ఞప్తి చేస్తూ, తమ సుఖవంతమైన స్వతంత్ర భవిష్యత్తును చూపుతూ వుండే ఒక మహావీరుని విగ్రహం చెక్కమని వాళ్లు శిల్పికి తీర్మానాలు చేసి పంపారు. శిల్పి అలాగే అని ఒక మహావీరుని విగ్రహం చెక్కడం మొదలుపెట్టాడు. కానీ మొదటి నుంచి సామాన్య ప్రజలు పోరాటాలు చేసి స్వాతంత్ర్యం సంపాదిస్తే, తమ ప్రాబల్యం ఎట్టాగూ మంటగలుస్తుందని భయపడుతూ వచ్చిన డబ్బుస్వాములు తమ మీద అధికారం చెలాయిస్తున్న పరాయి దేశం డబ్బు స్వాములతో కలసి గుసగుసలూ వికవికలూ చేసి అధికారం తమ హస్తగతం చేసుకున్నారు. ఈ డబ్బు స్వాములు 'స్వతంత్ర విగ్రహం, ప్రజలకి నూతనంగా వచ్చిన ప్రభుత్వం పట్ల నమ్రత, విధేయత నేర్పే చిహ్నంగా, అల్లరి, ఆగం చేయకూడదని బోధించే గురువులా ఉండాలి. అందుకని ఓ ప్రశాంత తపస్విలాగో లేక సన్యాసిలాగో ఉండాలి' అని శిల్పిని ఆజ్ఞాపించారు. శిల్పి 'చిత్తం' అని మహావీరుడు విగ్రహం చెక్కినంత వరకూ ఆపి, దాన్నే సన్యాసి రూపంలోకి చెక్కసాగాడు.

ఆ దేశంలోని డబ్బు స్వాములలోనే ఇంకా కొందరు మహాత్ములు దేశాన్నీ, దాని ఆర్థిక పరిస్థితిని తమ జేబుల్లోనూ, భోషాణాల్లోనూ ఇరికించుకుని వున్నారు. వాళ్లకి ఈ సలహాలేవీ నచ్చలేదు. వాళ్లందరూ కలసి 'ఆ విగ్రహం మన విశాలమైన దేశ స్వతంత్ర వ్యాపార ప్రతిపత్తిని విస్తరింపచేసేదిగా ఒక గొప్ప ఓడల వర్తకుని రూపంలో ఉండాలి' అని ఆ శిల్పికి ఆదేశం పంపారు. ఆ శిల్పి ఆ ఆదేశం వెనుక ఉన్న ఆర్థిక బలాన్ని ఊహించుకుని 'అలాగే బాబూ' అని.. తను తయారుచేస్తున్న సన్యాసి విగహాన్నే ఒక గొప్ప వ్యాపారి విగ్రహంగా మార్చడానికి సంసిద్ధుడు అయ్యాడు.

కానీ అసలు ప్రభుత్వంలో వుండే పెద్దలు ఇవన్నీ పనికిరావని రెండు మూడు సబ్ కమిటీలు, నాలుగైదు సంఘాలు వేసి వాటి రిపోర్టులన్నీ కలేసి చదివి, వాటన్నిటినీ తీసివేసిన తర్వాత 'స్వతంత్ర విగ్రహం ప్రభుత్వం పట్ల భక్తినీ, నమ్రతనూ నేర్పేట్టు ఉండవలసిందే కానీ, అది సన్యాసిలా కాకుండా, ప్రజలకి ప్రభుత్వం పట్ల భయమూ, భక్తీ, గౌరవమూ, శ్రద్ధా నేర్పే సాయుధ సైనికుడి విగ్రహంగా ఉండాలని భావిస్తోంది. నిజమైన ప్రజాశాంతినీ, ప్రజాస్వామ్యాన్ని కాపాడేది ప్రభుత్వ సైన్యమే. అదీ కాకుండా ప్రజలలో కొందరు ఎల్లప్పుడూ ఆకలి అని, గుడ్డలు అని అల్లర్లు చేస్తూ ఆర్థిక సమానత్వమని లేనిపోని ప్రచారం చేస్తూ, ప్రజల ప్రశాంత జీవనాన్ని భగ్నం చేస్తున్నారు. అటువంటి వాళ్లకి స్వతంత్ర ప్రభుత్వంలోనైనా వాళ్ల ఆటలు సాగవని హెచ్చరికలు తెల్పుతూ స్వతంత్ర విగ్రహం ప్రభుత్వ సాయుధ సైనికుడి రూపంలో ఉండాలి' అని బహిరంగ ప్రకటన ఒకటి చేసి శిల్పికి హుకుం ఇచ్చారు.. సైనికుడి విగ్రహం చెక్కమని!

అలాగే.. అని శిల్పి తాను చెక్కుతున్న వర్తకుడి రూపాన్నే సాయుధ సైనికుడి రూపంలోకి మార్చుతున్నాడు. ప్రభుత్వ సలహాని డబ్బు స్వాములు హర్షించారు. వ్యాపారస్తులు ఆహ్వానించారు. అటూ ఇటూ మాట్లాడే పెద్దమనుషులు ఆమోదించారు. ప్రజలు మాత్రం ప్రభుత్వ ధోరణికి ముక్కు మీద వేలేసుకున్నారు. అయితే శిల్పి మాత్రం ఎడతెరపి లేకుండా శ్రమించి స్వాతంత్ర్య విగ్రహాన్ని తయారుచేశాడు. ఒక సుదినమున స్వతంత్ర విగ్రహాన్ని రాజధానిలో ప్రతిష్టించడానికి తీసుకుని వచ్చారు. అదివరకే తయారైన శిలావేదికపై స్వతంత్ర విగ్రహాన్ని ఉంచారు. ప్రభుత్వ అధ్యక్షుడు స్వతంత్రాన్ని గురించి ఒక మహోపన్యాసం చేసిన తర్వాత స్వతంత్ర విగ్రహానికి ఉన్న మొఖమల్ గుడ్డని తొలగించాడు. స్వతంత్ర విగ్రహం ఆధునిక ఆయుధాలతో సాక్షాత్కరించింది. భయంకరమైన దయ్యం రూపంలో..

### ఇది కథ!

చాలా చిన్న కథ రాసింది శారదగా ప్రసిద్ధుడు అయిన ఎస్.నటరాజన్. ఈ కథ రాసింది 1948లో అంటే స్వాతంత్ర్యం వచ్చిన ఒక సంవత్సరం తర్వాత. 1947లో జరిగింది. కేవలం అధికారం మార్పిడి మాత్రమేనని, అది కేవలం రాజకీయ స్వాతంత్ర్యమేనని, దానిమీద ఎలాంటి భ్రమలు లేవని, అది కాలక్రమంలో ఎలాంటి రూపం తీసుకోగలదో కూడా ఊహించడం ఈ కథ ప్రత్యేకత. ఎస్.నటరాజన్ తమిళనాడుకు చెందినవాడు. మన తెనాలిలో ఒక హోటల్‌లో సర్వర్‌గా పని చేస్తూ తెలుగు నేర్చుకుని శారద అనే కలం పేరుతో తెలుగులో అద్భుతమైన కథలు రాశాడు. శారద పేరు చెప్పగానే చాలామందికి మంచి చెడు, రక్తస్పర్శ, అపస్వరాలు గుర్తుకు వస్తాయి. శారద రాసిన చాలా చిన్న కథ ఇది. అయితేనే ఎన్నదగిన కథ. 2025వ సంవత్సరంలో ఈ కథను చదువుతుంటే, మన స్వాతంత్ర్యం నడిచివచ్చిన దారులన్నీ గుర్తుకువచ్చి మనసు దుఃఖపూరితం అవుతోంది.

మనది పేరుకు ప్రజలు ఎన్నుకున్న ప్రజాస్వామ్యమే కానీ మనలని పరిపాలిస్తున్నది మాత్రం ఒక ఆయుధం మాత్రమే. గ్రేహౌండ్స్ పేరిట, శాంతిభద్రతల పేరిట, నిర్వాసితుల తరలింపు పేరిట, ఉద్యమాల అణచివేత పేరిట, సంస్కృతీ పరిరక్షణ పేరిట దేశంలో ఎక్కడో ఒకచోట ఆయుధం, ఆ మాట నచ్చకపోతే సైన్యం కలగచేసుకోని రోజు ఒక్కటంటే ఒక్కటైనా ఉందా? ప్రజలు ఎన్నుకున్న నాయకులే ఆ ప్రజల మధ్యకు ప్రభుత్వం కల్పించే రక్షణ లేకుండా, సొంతంగా తయారుచేసుకున్న బౌన్సర్ల సైన్యం లేకుండా రాగలరా? మన యుద్ధ విమానాలు, మన మిరాజ్ 2000లు, మన అణ్వాయుధాలు అన్నీ ప్రజల రక్షణ, స్వాతంత్ర్యం కోసమేనా? మన స్వాతంత్ర్యం స్వతంత్రమేనా? రాజ్యాంగంలో మనం చెప్పుకున్న, సంకల్పం ఇదేనా? ప్రజల చేత, ప్రజలు కొరకు, ప్రజల వలన ఎన్నకోబడిన ప్రభుత్వం అంటే ఆయుధమేనా?

వంశీకృష్ణ, బాతాఖానీ సౌజన్యంతో..

## ప్రిన్సిపాల్ సౌమ్య అక్రమ బదిలీ నిలిపేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పత్రికవిలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కులనిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్, దళిత సంఘాల జెఎసి జిల్లా కన్వీనర్ దుర్గాసి గణేష్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నగర అధ్యక్షుడు కానుకూర్తి గోవింద, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపీ, అంబేద్కర్ యూనివర్సిటీ చైర్ సాధన సమితి జిల్లా కన్వీనర్ టి రమణ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా పొందూరు కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ రెజేటి సౌమ్య పై ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఆయన అనుచరులు చేస్తున్న ఆరోపణలు పూర్తి నిరాధారమన్నారు. ఆమె పై సోషల్ మీడియాలో ఊరుపేరు లేకుండా ఆకాశరామన్నలాగా పోస్టులు పెట్టడం కాకుండా ఆమెపై ఆధారాలు ఉంటే బహిరంగ చర్చికి రావాలగాని చిల్లర వ్యక్తుల లాగా చిల్లర ప్రకటనలు ఇవ్వడం కూన రవికుమార్‌కి, ఆయన అనుచర ముఠా సరికాదని హెచ్చరించారు, గుడ్లు మెనూ, అమలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సమస్య తప్ప ఒక్క పొందూరు కేజీబీవీ పాఠశాలకు పరిమితమైంది కాదన్నారు. అన్యాయంగా రాజకీయంగా అక్రమంగా రెజేటి సౌమ్య బదిలీని వెంటనే నిలుపుదల చేసి పొందూరులో పోస్టింగ్ ఇవ్వాలని లేని పక్షంలో దళిత,ఆదివాసీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఉద్యమానికి పిలుపు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించారు.






ఎస్.ఎం.పురం పంచాయితీ పరిధిలోని లింగాలపేటలో శుక్రవారం బస్ షెల్టర్ ప్రారంభించారు. ఈ షెల్టర్‌ను ఎంపీటీసీ కూన అప్పలనాయుడు నిర్మించగా గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ కేవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. 'ఎన్నాళ్ళ నుంచో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గమనించి ఈ నిర్మాణం చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, ఎచ్చెర్ల

## నిరుపేద కుటుంబాలకు నిత్యవసర వస్తువుల పంపిణీ

(సత్యంన్యూస్, టెక్కలి)

నిరుపేదలకు ఆకలి తీర్చేందుకు అభయం యువజన సేవాసంఘం వారు స్థాపించిన అభయం ఫుడ్ బ్యాంక్ ప్రతినిధులు టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం మండలాల నుండి ఆసరా లేని ఎనిమిది నిరుపేద కుటుంబాలకు శనివారం అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ పార్క్ వద్ద నెల రోజులకు సరిపడేలా 25 కేజీల రైస్ 20 రకాల నిత్యవసర వస్తువులు పంపిణీ చేసినట్లు అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు లాడె కామేశ్వరరావు తెలియజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో నిరుపేదలకు చేయూతనివ్వడానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండర్, సెక్రటరీ దేవాది శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ధర్మవరపు పూర్ణచారి, ట్రెజరర్ శ్రీనివాస్ బెహరా, సంఘ సభ్యులు యన్ సింహాచలం, అద్దాల వీరభద్రచారి, జగదీష్ పోరిడా, ఆట్ల నాగరాజు, మూగి దుర్గారావు, యు గోవిందరావు, యస్ మధన్ పాల్గొన్నారు.



## పోరాటాల స్ఫూర్తి గౌతులచ్చన్న



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బలహీనవర్గాలు, కార్మిక, కర్షక ప్రజల గొంతుకగా నిలిచి పోరాటాల బావుటా ఎగురవేసిన స్ఫూర్తిదాత సర్దార్ గౌతు లచ్చన్న అని వక్తలు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు గౌతు లచ్చన్న 116వ జయంతిని స్థానిక గాంధీ మందిరం సంఘ సంస్కర్తల స్మృతి వనంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రాజాం మున్సిపల్ అధికారి జి.ప్రసాదరావు, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, జామి భీమశంకర్, కొంక్యాన వేణుగోపాల్‌తోపాటు లచ్చన్న విగ్రహదాత వంగా మహేష్‌దేవ్ మాట్లాడుతూ జిల్లాలో స్వాతంత్ర్యస్ఫూర్తిని రగిలించడంతోపాటు రాజకీయ రంగంలో లచ్చన్న ప్రత్యేకముద్ర వేసుకున్నారన్నారు. తన గురువు ఆచార్య ఎన్.జి.రంగా కోసం పదవిని త్యాగం చేసి గురుభక్తిని చాటుకున్నారన్నారు. గౌతు లచ్చన్న మార్గదర్శకంలో జిల్లా, రాష్ట్ర రాజకీయాల్లో ఎందరో ఉన్నత స్థితికి చేరుకున్నారన్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా జిల్లాలో రాజకీయాల్లో నెరిపి దేశస్థాయికి ఎదిగిన లచ్చన్న స్ఫూర్తి సజీవంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గాంధీమందిర ప్రతినిధులు నక్క శంకరరావు, జి.నాగేశ్వరరావు, పెంకి చైతన్యకుమార్, ఎం.వి.ఎస్.శాస్త్రి, సువ్వారి రాజారావు, శర్మ తదితరులున్నారు

## విలువలుతో కూడిన విద్యను అభ్యసించటం ఆనందంగా ఉంది

(సత్యంన్యూస్, సంతబొమ్మాళి)

విలువలుతో కూడిన విద్యను అభ్యసించి, నన్ను సేవామార్గంలో నిలవటానికి ఆదర్శంగా నిలిపిన పాఠశాలకు, ఉపాధ్యాయులకు ఆనందంగా ఉందని డాక్టర్ పునీత్‌రాజ్‌కుమార్ అసోసియేషన్ వ్యవస్థాపకులు పుక్కళ్ళ నాగేంద్ర శనివారం అన్నారు. సంతబొమ్మాళి మండలం, జగన్నాధపురం ప్రభుత్వ పాఠశాలకు, పుక్కళ్ళ నాగేంద్ర బీరువాను బహుకరించారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు ఇతర పరీక్షా సామాగ్రిని అందించి మాట్లాడుతూ తాను ఈ పాఠశాలలోనే చదువుకున్నానని, విలువలతోపాటు, క్రమశిక్షణతో కూడిన విద్యను ఇక్కడ గురువులు వెన్నుతట్టి ప్రొత్సాహాన్నందించారన్నారు. విద్యార్థులు మానవతా దృక్పథంతో ఆలోచించాలని, పదిమందికి సహాయపడాలనే సంకల్పాన్ని చిన్ననాటినుండే వివరించేవారన్నారు. దీనిలో భాగంగా ప్రజాసేవకై డా. శ్రీ పునీత్ రాజ్‌కుమార్ అసోసియేషన్ స్థాపించి అనేక సేవాకార్యక్రమాలను నిర్వహించామన్నారు. ప్రధానోపాధ్యాయులు రఘునాధరావు మాట్లాడుతూ పుక్కళ్ళ నాగేంద్ర తమ పాఠశాలలో చదువుకొని, స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిధిగా రావటం ఆనందదాయకమని, సేవలకు చిరునామగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని, పాఠశాలకు అవసరమైన సామాగ్రిని అందించటం గొప్పవిషయమని తెలిపారు. కార్యక్రమంలో జగన్నాధపురం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.



ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666




# ఈసారికి శాలువలతో సరి!



- తటస్థంగా మారిన వరం తనయులు
- దేశం కోటాలో నేనే అధ్యక్షుడినంటున్న హరిగోపాల్
- విస్తృతంగా ప్రచారం చేస్తున్న ఊణ్ణ
- జిల్లా అధ్యక్షుడికి లైన్ క్లియర్‌కు గోవిందరాజులు వ్యూహం
- యువకుల కోటాలో మేమూ ఉన్నామంటున్న మల్లా, తంగుడు
- రసవత్తరంగా మారిన నగర కళింగకోమటి కార్యవర్గ ఎన్నిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగర కళింగకోమటి సంఘానికి కొత్త కార్యవర్గ నియామకం ప్రస్తుతానికి 'దుప్పటి' కప్పుకొని పడుకునే పరిస్థితిలో ఉంది. ఆదివారం ఈమేరకు ఎన్నిక/ఎంపిక నిర్వహించాల్సివున్నా ఇంతవరకు అందుకు సంబంధించిన సమయం, వేదికను శనివారం మధ్యాహ్నానికి ఇంకా నిర్ణయించలేదు. సంప్రదాయం మేరకు తాజా మాజీ అధ్యక్షుడు ఈ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయడానికి చొరవ తీసుకోవాలి. కానీ ఊణ్ణ నాగరాజు ఇంకా ఏడాదికి పైగా తన అధ్యక్ష పదవికి కాలపరిమితి ఉన్నా, అధికారం మారిందన్న ఒకే ఒక్క కారణంతో ఈ కథనం ప్రచురించే సమయానికి ఫిక్స్ చేయలేదు. అలా అని ఎన్నిక కోసం సమావేశం జరగదా? అంటే.. అదీకాదు. ఎందుకంటే.. సమయం, వేదికకు సంబంధించి ఊణ్ణ నాగరాజు నుంచి సమాచారం రాకపోతే తానే శనివారం సాయంత్రం దీన్ని ప్రకటిస్తానని పోటీలో ఉన్న కోరాడ హరిగోపాల్ ఇంతకు క్రితమే పేర్కొన్నారు. సీన్ కట్ చేస్తే.. కళింగకోమటి నగర కార్యవర్గం ఎన్నిక సమయం గడిచేకొద్దీ మలుపులు తీసుకుంటోంది. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నందున కోరాడ హరిగోపాల్ అధ్యక్షుడిగా ఆయనకు మద్దతు తెలిపినవారు మిగిలిన కార్యదర్శి, ట్రెజరర్, ఉపాధ్యక్షులు వంటి పోస్టులతో ఎంపికవుతారని, ఇది కేవలం లాంచనం మాత్రమేనని మొన్నటి వరకు అంతా భావించారు. కానీ అకస్మాత్తుగా ఊణ్ణ సర్వేశ్వరరావు తానూ రేసులో ఉన్నానని ప్రకటించడంతో హరిగోపాల్ ప్యానల్‌కు పదవులు పళ్లెంలో పెట్టి ఇవ్వడం అంత సులువు కాదని అందరికీ అర్థమైంది. అంతవరకు హరిగోపాల్‌కు తెర వెనుక మద్దతు ప్రకటించిన వరం తనయులు ఇప్పుడు తటస్తులుగా మారారు. హరిగోపాల్ నగర అధ్యక్షులు కావాలని కోరిక బలంగా సంతోష్‌కు ఉన్నా, ఊణ్ణ సర్వేశ్వరరావు అభ్యర్థిత్వాన్ని బహిరంగంగా వ్యతిరేకించే సాహసం చేయలేకపోతున్నారు. తెలుగుదేశం అధికారంలో ఉండటం వల్ల తానొక్కడినే అభ్యర్థినని, ఊణ్ణ సర్వేశ్వరరావు వైకాపా బలపరుస్తున్న అభ్యర్థి అని హరిగోపాల్ భావించినా సర్వేశ్వరరావు మాత్రం చాపకింద నీరులా తన ప్రచారం చేసుకుపోతున్నారు. కేవలం మార్కెట్‌లో వర్తకులు, పెద్దిన మురళీ మద్దతు మినహా ఇప్పటి వరకు హరిగోపాల్ తాను బరిలో ఉన్నానని, తన ఎన్నికకు సహకరించాలని ఎవరికీ ఫోన్ చేయలేదు. ఎందుకంటే.. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకుడే అధ్యక్షుడిగా ఉండాలన్న నిబంధన ఉంది కాబట్టి గడిచిన ఎన్నికల్లో ధర్మాన ప్రసాదరావు ఆధ్వర్యంలో జగన్మోహన్‌రెడ్డికి జైకొట్టిన ఊణ్ణ సర్వేశ్వరరావును ఎన్నుకునే పరిస్థితే ఉండదనేది హరిగోపాల్ వర్గం వాదన. వాస్తవానికి ఊణ్ణ సర్వేశ్వరరావుకు నగరంలో ఉన్న చాలామంది టీడీపీ నేతల కంటే ముందునుంచే టీడీపీలో సభ్యత్వం ఉంది. ఆ కార్డును ఇప్పుడు ఆయన బయటపెట్టారు. కేవలం గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా కళింగకోమట్లను బీసీల్లో చేరుస్తూ జీవో వచ్చినందున హర్షం వ్యక్తం చేశాం తప్ప, వైకాపా కోసం ఎక్కడా పని చేయలేదని ఆయన చెబుతూ తనకు మద్దతు తెలపాలని అందర్నీ కోరుతున్నారు. ఈమేరకు ఇప్పటికే మూడుసార్లు ఆయన వివిధ వర్గాలతో సమావేశమయ్యారు. నగరంలో కళింగవైశ్య కల్యాణ మండపం శిథిలావస్థకు వచ్చిందని, దీనికి ఆనుకొని ఉన్న రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేసి భారీగా ఆస్తివిలువను పెంచారని, ఇప్పుడు కళింగవైశ్య కల్యాణ మండపాన్ని ఆ రీతిలో బాగుచేయాలంటే పిలిస్తే పలికే విధంగా, పది రూపాయలు డొనేషన్ ఇచ్చే నాయకత్వం అవసరమనే నినాదాన్ని సర్వేశ్వరరావు తెర మీదకు తెచ్చారు. అయితే టీడీపీ అంటే కేవలం హరిగోపాల్ మాత్రమే కాదని, ఈ పార్టీలో ఉన్న జామి భీమశంకర్, బరాటం ఉదయశంకర్ గుప్త, ఇప్పిలి తిరుమలరావు వంటి చాలామంది సీనియర్లు ఉన్నారని, ఇక్కడ పార్టీల ప్రస్తావన లేకుండా కోమట్ల మద్దతు ఉన్నవారికే ఎంపిక చేయాలని కోరుతూ మరో ప్యానల్ తెరమీదకు వచ్చింది. వరం తనయులు కోరాడ హరిగోపాల్‌కు తెర వెనుక మద్దతు ఇచ్చినంత వరకు హరిగోపాల్ వర్గంగా ఉన్న అంధవరపు చైతన్యప్రభు, మల్లా కల్యాణ్ చక్రవర్తి, తంగుడు రాజులు ఇప్పుడు పార్టీలకు అతీతంగా యువత కోటాలో తమను ఎన్నుకోవాలని రెండు రోజుల నుంచి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. అయితే హరిగోపాల్, లేదంటే వైకాపా మాత్రమే కాదని, తమను కూడా కళింగకోమటి అభివృద్ధి కాంక్షకులుగానే చూడాలని వారు పిలుపునిస్తున్నారు. దీంతో ఇప్పుడు ముక్కోణపు పోటీ మొదలైంది. వాస్తవానికి ఊణ్ణ సర్వేశ్వరరావు వెనుక మద్దతిస్తున్న నేతలు వైకాపాలో ఉన్నవారే. అలాగని వారిలో చాలామంది గతంలో టీడీపీలో కూడా కొనసాగివున్నారు. అలాగే టీడీపీలో కూడా ఓ బలమైన వర్గం ఊణ్ణ సర్వేశ్వరరావుకు మద్దతు తెలుపుతుంది. పార్టీ మాత్రం కోరాడ హరిగోపాల్‌ను నగర సంఘం అధ్యక్షుడిగా నియమించాలని భావిస్తోంది. ఎందుకంటే.. తనకు జిల్లా కళింగకోమటి అధ్యక్ష పదవి కావాలని హరిగోపాల్ ఆమధ్య తన గ్రూపుతో సమావేశం పెట్టి రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు దృష్టికి తీసుకువెళ్లారు. కానీ ఆయన సతీష్‌ను అధ్యక్షుడిగా ప్రకటించారు. ఇప్పుడు హరిగోపాల్, సతీష్‌ల మధ్య పంచాయితీ తేలకపోవడం బోయిన గోవిందరాజులుకు తలనొప్పిగా మారింది. ఇప్పుడు కోరాడ హరిగోపాల్‌ను నగర అధ్యక్షుడ్ని చేస్తే, సతీష్‌ను తాను అనుకున్నట్టే జిల్లా అధ్యక్ష పదవికి పంపించవచ్చునేది గోవిందరాజులు భావన. అదే సమయంలో ఇటీవల పెద్ద ఎత్తున మార్కెట్‌లో రక్తదానం నిర్వహించిన కోరాడ హరిగోపాల్‌ను కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఫోన్‌లో అభినందించారు. ఈ సందర్భంగా నగరంలో నగర సంఘ ఎన్నికల అంశాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అధ్యక్షుడిగా హరిగోపాలే ఉండాలని తాను కోరుకుంటున్నానన్న విషయాన్ని కేంద్రమంత్రి బయటపెట్టడంతో పాటు స్థానిక ఎమ్మెల్యేను కలిసి మద్దతు కూడగట్టాలని హరిగోపాల్‌కు సూచించినట్టు భోగట్టా. అయితే హరి ఈమేరకు ఎవరిని కలిశారో తెలియదుగానీ, సర్వేశ్వరరావు మాత్రం వైకాపా కేటగిరీలోకి వస్తారు కాబట్టి తాను మాత్రమే అభ్యర్థినన్న భావనలో ఉన్నారు. కానీ బలమైన పోటీ సర్వేశ్వరరావు రూపంలో రావడంతో మల్లా కల్యాణ్ చక్రవర్తి ప్యానల్ కూడా రంగంలోకి వచ్చింది. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే.. ఆదివారం నాటి ఎన్నిక ప్రక్రియ జరగదని అర్థమవుతుంది. ఎప్పటి మాదిరిగానే వచ్చినవారిలో పెద్దలకు శాలువాలు (దుప్పటి) కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి కొన్నాళ్లు ఈ వ్యవహారాన్ని పడుకోబెట్టేస్తారు. ఈలోగా కళింగకోమటి కార్పొరేషన్ చైర్మన్ పోస్టుకు ఎవరెళ్తారో తెలిసిపోతుంది. ఆ తర్వాత నగర టీడీపీ కార్యవర్గంలో ఎంతమంది కోమట్లు అకామిడేట్ అవుతారో తేలుతుంది. అప్పుడు ఒక వ్యక్తికి ఒకే పదవి రీతిలో మూడు గ్రూపులను కూర్చోబెట్టి పదవులు సర్దుతారు. అప్పటికీ ఏకాభిప్రాయానికి రాకపోతే, వరం పెద్ద కుమారుడు ప్రసాద్‌ను రంగంలోకి దించినా ఆశ్చర్యం లేదు.

## ఊరంతా వణికిపోతోంది!



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పార్వతీపురం మన్యం జిల్లా అనేకంటే మన పక్కనే ఉన్న పాలకొండ అంటే మనకు కాస్త తగ్గరగా ఉంటుంది. ఈ పోలీస్‌స్టేషన్ దగ్గరలో ఉన్న టీకే రాజపురం అంటే స్టేషన్‌లో చాలామందికి తెలియదు. ఎందుకంటే అంత ప్రశాంతమైన ఊరు అది. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో గ్రామంలో ఒక్కో సామాజికవర్గం ప్రధానంగా ఉంటుంది. కానీ టీకే రాజపురంలో లేని కులమంటూ ఉండదు. చివరకు పార్వతీపురంలో మాత్రమే కనిపించే దాసరి సామాజికవర్గానికి చెందినవారు కూడా ఈ ఊరిలో కనిపిస్తారు. ఇంత ప్రశాంతమైన ఊరు గత మూడు రోజులుగా కంటిమీద కునుకు లేకుండా కాలం వెల్లదీస్తోంది. ఈ గ్రామంలో ఇంటి ముందు పార్క్ చేసివున్న వాహనాలను రాత్రి సమయంలో ఎవరో తగులబెట్టేస్తున్నారు. అదే సమయంలో తమ ప్రాణాలకు ముప్పు ఉందని భావిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

2023లో వాలంటీర్‌గా పని చేసిన ఒక యువకుడు స్థానికంగా ఉన్న మరో యువతిని టీజ్ చేశాడని పాలకొండ పోలీస్‌స్టేషన్‌లో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో యువకుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తామని పోలీసులు చెప్పారు. కానీ చదువుకున్న యువకుడు కాబట్టి భవిష్యత్తు పోతుందని మందలించి పంపించేశారు. సీన్ కట్ చేస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాలంటీర్ ఉద్యోగాలు పోయాయి. ఇటీవల వంగర మండలంలో 20 తులాల బంగారం చోరీ కేసులో ఇదే యువకుడ్ని ఎ-3గా పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత బెయిల్ మీద బయటకు వచ్చిన ఈ యువకుడు ఇందులో తన ప్రమేయం లేదని, అందుకే బయట తిరగగలుగుతున్నానని, గ్రామంలో కొందరు తనను కేసుల్లో ఇరికించాలని చూస్తున్నారని, తనకేదైనా జరిగితే వారిదే బాధ్యతంటూ పోలీసులనుద్దేశిస్తూ ఓ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. అదే సమయంలో టీకే రాజపురంలో ఇటీవల ఒక ఇంటిలో దొంగతనం జరిగింది. దీనికి, వంగరలో బంగారం చోరీకి సంబంధించిన నిందితులకు సంబంధం ఉందని గ్రామస్తుల భావన. శుక్రవారం రాత్రి కూడా మూడు ద్విచక్ర వాహనాలను కాల్చేయడంతో తమ వాహనాలను పోలీస్‌స్టేషన్‌లోనే పార్క్ చేసుకుంటామంటూ శనివారం గ్రామస్తులంతా పాలకొండ స్టేషన్‌కు వెళ్లారు. ప్రస్తుతానికి టీకే రాజపురం చోరీ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

## వర్ధమాన రచయిత్రికి రెండోసారి విశ్వభారత్ వీర పురస్కారం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సాహిత్యం, సామాజిక సేవారంగాల్లో విశిష్ట కృషి చేస్తున్న వర్ధమాన రచయిత్రి, మహిళా పోలీస్ బమ్మిడి అమ్మోజీకి రెండోసారి ప్రతిష్ఠాత్మక విశ్వభారత్ వీరపురస్కారం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారం ఆమెకు అందజేశారు. ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్, సినీ నటి జయలలిత, విశ్వభారత్ చైర్మన్ బలివాడ రమేష్‌లు ఈ అవార్డును ప్రదానం చేశారు. దేశభక్తి, సైనికుల త్యాగాలపై ఆమె రాసిన కథనాలు, సమాజ సేవా కార్యక్రమాల్లో చూపిన అంకితభావం చూసి ఈ అవార్డుకు ఎంపిక చేశామని వారు తెలిపారు. ఆమె సాహిత్యం ద్వారా సైనికుల సేవా భావాన్ని రచనల ద్వారా అందించడం, సామాజిక కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించడం ప్రశంసనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమ్మోజి మాట్లాడుతూ రెండోసారి వరుసగా ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకోవడం తనకు గౌరవంగా భావిస్తున్నానన్నారు. భవిష్యత్తులో తనకు వీలైనంత వరకు సమాజానికి ఉపయోగపడే ఇటువంటి కథనాలు రాయడం, సేవ కార్యక్రమాల్లో పాల్గొనడడం చేస్తానన్నారు. టెక్కలి మండలం పోలవరం గ్రామానికి చెందిన అమ్మోజీ ప్రస్తుతం రణస్థలం మండలంలో మహిళా పోలీసుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

## ఆకాశవాణిలో లలితారెడ్డి ప్రసంగాలు

(సత్యంన్యూస్, జి.సిగడాం)




ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో ఈనెల 18,19,21,23 తేదీల్లో ఉదయం 6.30 గంటలకు స్థానిక కస్తూర్బా గాంధీ బాలికావిద్యాలయం పి.జి.టి తెలుగు ఉపాధ్యాయిని లలితారెడ్డి ప్రసంగాలు ప్రసారమవుతాయి. చింతన కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాయోజిత అంశాలపై ఆమె మాట్లాడుతారు. గతంలో కూడా లలితా రెడ్డి ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రం నుంచి వివిధ అంశాలపై ప్రసంగించారు. ఆమె ఇంటర్వ్యూను సైతం ఈ కేంద్రం ప్రసారం చేసింది. ఇంతవరకు ఈమె మూడు పుస్తకాలను రాసి ప్రశంసలు పొందారు. ఈమె రాసిన పుస్తకం లలిత కథాసాగరం (బాలల కథా సంపుటి) రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలు కొనుగోలు చేసేందుకై రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు 2003లో సైటేషన్ మంజూరు చేయడం విశేషం. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పలు సాహితీ పురస్కారాలను పొందారు. జిల్లా తెలుగు రచయితల వేదిక అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్వీ రమణమూర్తి, సభ్యులు అభినందించారు.


## ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రముఖ స్వతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుక శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి ఎఎస్పీ పి.శ్రీనివాసరావు పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆదేశించిందన్నారు. ఈమేరకు ఎస్పీ మహేశ్వరరెడ్డి సూచనలతో కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. లచ్చన్న రైతులు, ఓటు హక్కు లేని ప్రజల కోసం పోరాటం చేశారన్నారు. పలాసలో ఉప్పు సత్యాగ్రహం, క్విట్‌ఇండియా ఉద్యమంలో కూడా పాల్గొన్నారు అని,బ్రిటిష్ రాజ్‌కు వ్యతిరేకంగా ఆయన చేసిన కార్యకలాపాలకు గాను ఆయనకు సర్దార్ బిరుదు లభించింది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఎస్పీ శేషాద్రి, సీఐ శ్రీనివాసరావు ఆర్ఐ లు నరసింగరావు, శంకర్ ప్రసాద్, కార్యాలయ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## చిక్కోలు యాస భాష ప్రాభవానికి కృషి చేయాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా వజ్రోత్సవ వేడుకలో, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రచయిత స్వామి వివేకానంద జాతీయ అవార్డు గ్రహీత గురుగుబెల్లి లోకనాథం ఇరువురు కలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ప్రాంత మాండలీకం యాస భాష ప్రాభవానికి దీర్ఘకాలిక ప్రణాళికకు రూపకల్పన చేయాలని, త్వరలో సాంస్కృతికరంగ నిపుణులతో సమాలోచనలు సమావేశాలు జరపాలని లోకనాధానికి రామ్మోహన్ నాయుడు సూచించారు.

## శ్రీయోగ దక్షిణామూర్తికి అష్టోత్తర పుస్తకార్చన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సత్యసాయి జిల్లాలో గల హిందూపురంలో ఉన్న శ్రీ యోగ దక్షిణామూర్తి ఆలయంలో అష్టోత్తర పుస్తకార్చన నిర్వహించారు. కాశిన వెంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు తమ స్వీయ రచనగా 'నమో శ్రీ దక్షిణామూర్తి' అనే 108 పుస్తకాలతో స్వామివారికి విశ్వజయము సభ్యుల పిల్లల శ్రేయస్సును కోరుతూ అర్చన జరిపించి, వాటిని భక్తులకు వితరణ చేయమని ఆలయ ప్రధానార్చకులు హోసూర్ సాత్విక్ శాస్త్రికి అందజేశారు. ఈ పుస్తకంలో భారతదేశంలో ఉన్న పురాణ ప్రసిద్ధ, సుప్రసిద్ధ, లింగరూపంలో గల, విచిత్రాలకు నెలవైన, విభిన్న నామాలతో గల, అతి పెద్ద విగ్రహాలున్న స్వామి ఆలయాల విశేషాలను, అతని చరిత్ర, స్తోత్రాలను పొందుపర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ శాస్త్రి, నరసింహమూర్తి, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## జగన్నాథనాయుడుకు వజ్రోత్సవ సత్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


శ్రీకాకుళం జిల్లా వజ్రోత్సవాల సందర్భంగా వావిలపల్లి జగన్నాధ నాయుడును శుక్రవారం శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, శ్రీకాకుళం, నరసన్నపేట, ఎచ్చెర్ల శాసన సభ్యులు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, నడికుదిటి ఈశ్వరరావు, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, జాయింట్ కలెక్టర్ జోనైల్ అహ్మద్ అహ్మద్‌లు పాల్గొన్నారు.



## శ్రీకాకుళం జిల్లాకు, చెరగని చరిత్ర ఉంది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బలగ మునిసిపల్ పాఠశాల విద్యార్థులను ప్రోత్సాహిస్తూ, అభివృద్ధికి, స్థానిక ప్రభాకర్ కోలనీకి చెందిన విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ఆరికతోట కనకరాజు రూ.10వేల విరాళాన్ని అందించారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీకాంత్ తల్లిదండ్రులు పాల్గొని జెండా వందన ఆవిష్కరణ చేశారని, పాఠశాల ప్రిన్సిపాల్ యు.రామనాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర్య భారతదేశం పొందడానికి మహనీయుల త్యాగాలు, పోరాట సమాలోచనను విద్యార్థులకు వివరించారు. విశిష్ట అతిధిగా పాల్గొన్న డా.అరికితోట కనకరాజు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాకు, చెరగని చరిత్ర ఉందని, భారత పౌరులు, బ్రిటిషర్లతో ఎలా పోరాడారో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. 75 సంవత్సరాల శ్రీకాకుళం జిల్లా ఏర్పాటు కావటానికి, జిల్లా సమరయోధుల కష్టాన్ని వివరిస్తూ, శ్రీకాకుళంలో అన్ని రంగాల్లో ముందుందని, రచయితలు, కళాకారులు, గాయకులు, చిత్రకళా నటులు, ఆటగాళ్ళు, క్రీడలు, వెయిట్ లిఫ్టర్లు, విద్యా సంస్థలు, రాజకీయ నాయకులు ఇలా చెప్పుకుంటూపోతే తరగని చరిత్ర ఉందన్నారు. పదవ తరగతిలో ప్రతిభకనబరిచిన విద్యార్థులు ఎం.కుసుమ, ఏ.పూజిత, జి.ధనుస్యలకు ప్రశంసా పత్రాలను అందించగా, సోషల్ ఉపాధ్యాయులు జగదీశ్, సోషల్ విభాగంలో ప్రతిభ కనబరిచిన 9మంది పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయలు పారితోషికాన్ని అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థి, విద్యార్థినిలు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.